# వృద్ధుల మోముల్లో చిరునవ్వులు

- శ్రీ నిలయం ఆశ్రమంలో అన్నప్రసాద వితరణ
- వాసవి క్లబ్, యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం
- సోమ శివకుమార్ కుమారుడి జన్మదినం సందర్భంగా విందు



**మనసులో మాట - సిద్దిపేట**

వ్యక్తిగత ఆనందాన్ని సామాజిక సేవతో పంచుకోవడమే నిజమైన తృప్తి అని నిరూపించారు వాసవి క్లబ్, యూత్ క్లబ్ ప్రతినిధులు. సిద్దిపేటలోని శ్రీ నిలయం వృద్ధాశ్రమంలో శుక్రవారం వాసవి క్లబ్, యూత్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సోమ శివకుమార్, వనజ దంపతుల కుమారుడి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆశ్రమంలోని వృద్ధులకు రుచికరమైన భోజనం వడ్డించడంతో పాటు పండ్లు, పలహారాలు అందజేశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమ వంతు సాయంతో వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు నింపిన ఈ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ కూర శ్రీనివాస్, యూత్ క్లబ్ ప్రెసిడెంట్ బుక్క శివకుమార్, దాతలు సోమ శివకుమార్, వనజ, సంతోష్ కుమార్, యాదగిరి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- మోడల్ స్కూల్లో పీఎం శ్రీ 'మెంటరింగ్ టాక్'
- అవగాహన కల్పించిన ప్రొఫెసర్ రామస్వామి



**బెజ్జంకి, ఫిబ్రవరి 6 (మనసులో మాట):** ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా బెజ్జంకి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బయోటెక్నాలజీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ రామస్వామి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.'మెంటరింగ్ టాక్'లో భాగంగా ఆయన కెరీర్ గైడెన్స్, పర్యావరణ పరిరక్షణ, జెనెటిక్ ఇంజనీరింగ్ వంటి అత్యాధునిక అంశాలపై విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఉన్న అవకాశాలను, పరిశోధన రంగంలోని ప్రాధాన్యతను ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయి సైంటిస్ట్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ రామస్వామి తమ విద్యార్థులతో సమయం గడపడం ఎంతో గర్వకారణమని ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ విజ్ఞాన సదస్సు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను రేకెత్తించిందని వారు ఈ సందర్భంగా ప్రొఫెసర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ హైమావతి**

**స్టాక్ రిజిస్టర్‌లో తప్పులు, అసంబద్ధ వంటకాలపై అసహనం**

**మనసులో మాట - సిద్దిపేట**

నంగునూరు మండలం నర్మేట గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న రాత్రి భోజన నాణ్యతను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వంటశాలను సందర్శించిన కలెక్టర్.. అన్నం, సాంబారుతో పాటు ప్రత్యేకంగా బిర్యానీ కూర, టమాటా చట్నీ తూకాలను మరియు రుచిని తనిఖీ చేశారు. అయితే స్టాక్ రిజిస్టర్‌లో కూరగాయల వివరాలు తప్పుగా ఉండటం, కొలతలకు అనుగుణంగా వంటలు చేయకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు గానూ సంబంధిత ఎస్.ఓ (ఇ.ా) పై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌ను ఫోన్ ద్వారా ఆదేశించారు.నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వాడాలని, కాలం చెల్లిన వస్తువులను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన కామన్ డైట్ మెనూ ప్రకారం ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు అన్నీ సమతుల్యంగా అందించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ.. శారీరకంగా, మానసిక బలంగా ఉండటానికి పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.





## పారిశుధ్య లోపాలపై కమిషనర్ సీరియస్

**సిద్దిపేట 29వ వార్డులో అశ్రిత్ కుమార్ పర్యటన**

**కాలువలపై అక్రమ స్లాబ్‌ల తొలగింపునకు ఆదేశం**

**మనసులో మాట - సిద్దిపేట**

సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ శుక్రవారం ఉదయాన్నే పట్టణంలోని 29వ వార్డులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వార్డులోని పారిశుధ్య లోపాలు, అక్రమ నిర్మాణాలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి వార్డులోని మురికి కాలువలను పరిశీలించి, పేరుకుపోయిన సిల్టును వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన అక్రమ స్లాబ్‌లను జేసీబీలతో తొలగించాలని కమిషనర్ సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులు పగిలి మురుగు నీరు రోడ్డుపైకి వస్తున్న విషయాన్ని గమనించిన ఆయన.. వెంటనే మరమ్మతులు చేయించాలని, లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించినప్పుడే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అనంతరం పట్టణంలోని 25, 41వ వార్డుల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కమిషనర్ కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు యోగేశ్వర్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## 37వ వార్డులో 'ఫుట్‌బాల్' జోరు!

**ప్రజల మధ్యే ఉంటూ సమస్యలు పరిష్కరిస్తా**

**స్వతంత్ర అభ్యర్థి రమేష్ సింగ్‌కు పెరుగుతున్న మద్దతు**



**సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (మనసులో మాట):** సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో 37వ వార్డు స్వతంత్ర అభ్యర్థి ఠాగూర్ రమేష్ సింగ్ దూసుకుపోతున్నారు. తన ఎన్నికల గుర్తు 'ఫుట్‌బాల్'తో వార్డులోని ప్రతి ఇంటినీ సందర్శిస్తూ ఓటర్ల మద్దతు కోరుతున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు.ఈ సందర్భంగా రమేష్ సింగ్ మాట్లాడుతూ.. గత కొంతకాలంగా తాను ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానని తెలిపారు. వార్డులో మౌలిక వసతుల కల్పన, డ్రైనేజీ, తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే 37వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా రమేష్ సింగ్ కాలనీల్లోని పెద్దలను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూనే వార్డు ప్రగతికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ సింగ్ మద్దతుదారులు, కాలనీవాసులు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



## మున్సిపల్ ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ పూర్తి

**కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, ఫిబ్రవరి 6 (మనసులో మాట)**

మంచిర్యాల జిల్లాలో జరగనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.గంగాధర్, జిల్లా విద్యాధికారి యాదయ్యలతో కలిసి ఆయన ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి, ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలకు అవసరమైన పోలింగ్ బృందాలను రాండమైజేషన్ పద్ధతిలో కేటాయించామని వివరించారు. ప్రతి బృందంలో ఒక పి.ఓ , ఒక ఎ.పి.ఓ మరియు ముగ్గురు ఓ.పి.ఓ విధుల్లో ఉంటారని తెలిపారు. ఇందులో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీకి 68 బృందాలు, చెన్నూరుకు 36, క్యాతనపల్లికి 45, లక్షెట్టిపేటకు 30 బృందాలను కేటాయించగా, మంచిర్యాల నగరపాలక సంస్థకు గరిష్టంగా 265 బృందాలను కేటాయించినట్లు వెల్లడించారు. ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యే సర్వీస్ ఓటర్ల కోసం ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత ఓటర్లు ఈ నెల 8, 9 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఇందుకోసం బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట, క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయాల్లో మరియు మంచిర్యాల కార్పొరేషన్ కోసం నస్పూర్ కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు తమ వెంట ఫారం-12 మరియు ఓటరు ఎపిక్ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ మరియు ఓట్ల లెక్కింపు కేంద్రాల వివరాలను కూడా కలెక్టర్ ప్రకటించారు. మంచిర్యాల కార్పొరేషన్ కోసం ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాల, బెల్లంపల్లి కోసం బజార్ ఏరియా జడ్పీ హైస్కూల్, చెన్నూరు కోసం అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ హైస్కూల్, క్యాతనపల్లి కోసం ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ మరియు లక్షెట్టిపేట కోసం పాత ఎంపీడీవో కార్యాలయాన్ని కేంద్రాలుగా ఖరారు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్ తో పాటు ఎన్నికల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కమలం గుర్తే సంగారెడ్డికి శ్రీరామ రక్ష

**హిందువుల సంఖ్య తగ్గుతోంది.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**సంగారెడ్డిని 'నాల్ సాబ్ గడ్డ'గా మారనివ్వం**

**భావితరాల భద్రత కోసం బీజేపీకి పట్టం కట్టండి**

**ఎంపీ రఘునందన్ రావు**

**12వ వార్డు కార్నర్ మీటింగ్‌లో మెదక్ ఎంపీ సంచలన వ్యాఖ్యలు**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 6 (మనసులో మాట):** "సంగారెడ్డి భవిష్యత్తుపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయం వచ్చింది. మన సంస్కృతి, సంప్రదాయం మరియు భావితరాల భద్రత కాపాడబడాలంటే కమలం గుర్తే శ్రీరామ రక్ష" అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. సంగారెడ్డి పట్టణంలోని 12వ వార్డులో నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని సంచలన వ్యాఖ్యలు చేశారు.సమాజంలో మారుతున్న పరిస్థితులపై ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. "రాను రాను హిందువుల సంఖ్య తగ్గిపోతున్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంగారెడ్డి ఏ దిశగా వెళ్తుందో ప్రజలు గమనించాలి. ఈ ప్రాంతం ఎట్టి పరిస్థితుల్లోనూ 'నాల్ సాబ్ గడ్డ'గా మారకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. మన అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు.భావితరాలు ప్రశాంతంగా, గౌరవంగా జీవించాలంటే బీజేపీ అభ్యర్థుల గెలుపు అనివార్యమని రఘునందన్ రావు పేర్కొన్నారు. 12వ వార్డు అభ్యర్థి సాహితీ-రామును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి బీజేపీకి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధికి, రక్షణకు బీజేపీయే ఏకైక ప్రత్యామ్నాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఆరోగ్యమే అసలైన సిరిసంపద!





- విద్య, వైద్యం ఉచితంగా అందాలి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- ఎల్బీనగర్‌లో 'వెల్నాక్స్' మెడికల్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం
- యువత నైపుణ్యాలను పెంచుకుని నాయకులుగా ఎదగాలి

**ఎల్బీనగర్, ఫిబ్రవరి 6 (మనసులో మాట):** "మనిషికి ఎన్ని ఆస్తులున్నా.. ఆరోగ్యమే అసలైన సిరిసంపద. ప్రజలకు సేవ చేయడమే ఆధునిక వైద్యం లక్ష్యం కావాలి" అని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఉద్ఘాటించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం బాలాజీ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లిలి'వెల్నాక్స్ మెడికల్ రిహాబిలిటేషన్ సెంటర్'లిలిను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

### ప్రభుత్వాల బాధ్యత అది..

ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలందరికీ ఈ రెండూ ఉచితంగా, నాణ్యంగా అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. యువత మారుతున్న కాలానికి అనుగుణంగా కమ్యూనికేషన్ స్కిల్స్ (భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు) పెంచుకుని, సమాజంలో నాయకత్వ పాత్ర పోషించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

### నిర్వాహకులకు అభినందనలు


అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, నాణ్యమైన పునరావాస వైద్య సేవలు అందించేందుకు ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ స్వాతి ప్రత్తిపాటి, డాక్టర్ సిద్ధార్థ సాయిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కేంద్రం ప్రజారోగ్యానికి ఒక కీలక మైలురాయిగా నిలవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కామినేని ఎండీ శశిధర్, ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రాంత సంఘచాలక్ సుందర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
- సర్వీస్ రోడ్లు లేకుండా చలాన్లు వేయడం దారుణం
- ఆటో కార్మికులకు నెలకు రూ. 4,500 భృతి ఇవ్వాలి: సీఐటీయూ

**ఎల్బీనగర్, ఫిబ్రవరి 6 (మనసులో మాట):** రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 12న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ (జ×ఖ) పిలుపునిచ్చింది. హయత్ నగర్ కుంట్లూర్ రోడ్డులోని ఆటో యూనియన్ కార్మికులతో నిర్వహించిన సన్నాహక సమావేశానికి సీఐటీయూ జిల్లా నాయకులు కీసర నర్సిరెడ్డి, ఏ. బూసి నరసింహ, ట్రాన్స్ పోర్ట్ జిల్లా అధ్యక్షుడు ముషం నరహరి, గౌరవ అధ్యక్షుడు కడారి రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. హయత్ నగర్ నుంచి ఎల్బీనగర్ వరకు సర్వీస్ రోడ్లు పూర్తి చేయకుండానే, రాంగ్ రూట్ పేరుతో ఆటో కార్మికులపై, వాహనాలపై పోలీసులు విచక్షణారహితంగా చలాన్లు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే సర్వీస్ రోడ్ల నిర్మాణం పూర్తి చేసిన తర్వాతే నిబంధనలు అమలు చేయాలని, అప్పటివరకు వేధింపులు ఆపాలని హితవు పలికారు. రవాణా రంగ కార్మికుల భద్రత కోసం తక్షణమే ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, చట్టాన్ని సవరించి ఆటో కార్మికులకు కూడా ప్రావిడెంట్ ఫండ్ (ఫ్రాఫీ) వర్తింపజేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పెట్రోల్, డీజిల్, టోల్ ఛార్జీలను తగ్గించి కార్మికులను ఆదుకోవాలని, ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపుల నుంచి వారికి రక్షణ కల్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా, మహాలక్ష్మి స్కీం వల్ల నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ. 4,500 భృతిని వెంటనే అందించాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి డ్రైవర్‌కు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు, కర్షకులు, మేధావులు, విద్యావంతులు ఏకమై ఫిబ్రవరి 12 సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నక్క అశోక్ గౌడ్, యాదయ్య, గడ్డం కుమార్, వీరయ్య, కిన్నెర కుమార్, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు



# హయత్ నగర్ ఆదర్శ డివిజన్ కావాలి

రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులకు ఆదేశం

**ఎల్బీనగర్, ఫిబ్రవరి 6 (మనసులో మాట):** హయత్ నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలపడమే తన లక్ష్యమని స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో జరుగుతున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో గత కొన్నేళ్లుగా నెలకొన్న రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు టీవీ రావు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు 'రంగుల చేపల' పెంపకం!

- కాకినాడలో కరీంనగర్ మహిళలకు ప్రత్యేక శిక్షణ
- అభినందించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- విభిన్న రంగాల్లో ఆదాయ మార్గాలను ఎంచుకోవాలని పిలుపు

**కరీంనగర్, ఫిబ్రవరి 6:** మహిళలు కేవలం సంప్రదాయ రంగాలకే పరిమితం కాకుండా, విభిన్న రంగాల్లో ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆకాంక్షించారు. జిల్లా మత్స్యశాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో గల రాష్ట్ర ఫిషరీస్ టెక్నాలజీ సంస్థలో అలంకరణ చేపల పెంపకంపై శిక్షణ పూర్తి చేసుకున్న కరీంనగర్ మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులను ఆమె అభినందించారు. కాకినాడలో మూడు రోజుల శిక్షణ కరీంనగర్ జిల్లాకు చెందిన 19 మంది మహిళా సభ్యులు కాకినాడలో మూడు రోజుల పాటు అలంకరణ చేపల ఉత్పత్తి, పెంపకంపై శిక్షణ పొందారు. శిక్షణ ముగించుకుని వచ్చిన సభ్యులు జిల్లా కలెక్టర్ ను ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి, తాము స్వయంగా తయారు చేసిన అక్వేరియంను, అలంకరణ చేపలను కానుకగా అందించారు. డిమాండ్ ఉన్న రంగాలపై దృష్టి ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అలంకరణ చేపల పెంపకానికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా మహిళలు అక్వేరియంలలో పెంచుకునే వివిధ రకాల చేపలు, వాటి సంతాన ఉత్పత్తి విధానం, పెంపకానికి కావాల్సిన నీరు, వాతావరణం మరియు ఆహారం తయారీ వంటి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకున్నారని వెల్లడించారు. అంతేకాకుండా అక్వేరియంల తయారీ మరియు చేపల ప్యాకింగ్ వంటి మెళకువలను కూడా నేర్చుకున్నారని తెలిపారు. ఆర్థిక సాధికారతే లక్ష్యం భవిష్యత్తులో ఈ మహిళా సంఘం సభ్యులు సొంతంగా అలంకరణ చేపల పెంపకం మరియు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకుని



మంచి ఆదాయం పొందవచ్చని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని విభిన్న రంగాల్లో మహిళలకు శిక్షణ ఇప్పించి వారి ఆర్థిక వృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ భారతి, ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, ఎఫ్.డి.ఓ మంజుల తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

హెడ్ లైన్స్‌లో నిలవాలంటే గొప్ప పనులు చేయాలి కానీ, అల్ప బుద్ధితో అభాసుపాలవ్వకూడదని నటుడు చంద్రహాస్‌ను ఉద్దేశించి తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నూతన నటుడు చంద్రహాస్ తన సినిమా పబ్లిసిటీ కోసం జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడంపై తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం తీవ్రంగా స్పందించింది. సీనియర్ జర్నలిస్ట్ అశోక్ కుమార్‌ను కించపరిచేలా మాట్లాడటం, సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించడంపై మేడవరపు రంగనాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.“నటుడిగా ఎదగాలంటే ముందు సంస్కారం నేర్చుకో.. పబ్లిసిటీ కోసం పిచ్చి వేషాలు వేస్తే జర్నలిస్టుల పవర్ ఏంటో చూపిస్తాం“ అని గట్టిగా హెచ్చరించారు. సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ వేదికగా నటుడు చంద్రహాస్ వ్యవహరించిన తీరుపై జర్నలిస్టు లోకం నిప్పులు చెరుగుతోంది. సీనియర్ జర్నలిస్టు వేమూరిపల్లి అశోక్ కుమార్‌ను ఉద్దేశించి చంద్రహాస్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ‘బరాబర్ ప్రేమిస్తా‘ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చంద్రహాస్ ప్రదర్శించిన తీరు, జర్నలిస్టులపై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.



# చంద్రహాస్..

## నోరు అదుపులో పెట్టుకో

గలీజ్ పాటలు..పైపెచ్చు బుకాయింపులు

నీ తాటాకు చప్పుళ్ళకు జర్నలిస్టులు భయపడరు



*నీ సంస్కారం ఏపాటిదో చెప్పకనే తెలుస్తోంది..-సినిమా ప్రమోషన్ కోసం ఎంతకైనా దిగజారతారా?*

## బూతు పాటలు పాడటమే కాకుండా బెదిరింపులా?

### జర్నలిస్టులు సామాజిక బాధ్యత కలిగిన వారు

ప్రభుత్వానికి, ప్రజలకు మంచి చెడు విశ్లేషించి చెప్పేవాడే జర్నలిస్టు

అటువంటి జర్నలిస్టులపై నోరు పారేసుకుంటే సహించేది లేదు!

సమాజాన్ని పెడదోవ పట్టించే నీలాంటి వారికి బారాబర్ బుద్ధి చెబుతాం

నీ సినిమా చీప్ పబ్లిసిటీ కోసం జర్నలిస్టులపై బెదిరింపు వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం

---

నీ పాటను మీ తల్లిదండ్రులు ఖండించకపోతే.. వారు సమర్థిస్తున్నారేమో అనే అనుమానం కలుగుతోంది

---

మీ ఈవెంట్ కి వచ్చిన ముఖ్య అతిథులు కూడా ఇప్పుడు సిగ్గు పడుతున్నారు

---

అయినా నీకు సిగ్గు రాకపోవడం సిగ్గుచేటు

---

నటనే కాదు సమాజంలో బ్రతుకుతున్నప్పుడు మంచి నడవడిక అవసరం

## చిత్ర పరిశ్రమకు, జర్నలిస్టులకు అవినాభావ సంబంధం ఉంది

### నీలాంటి వారు ఆ బంధానికి కీడు తలపెట్టొద్దు, చిత్ర పరిశ్రమ పరువు తీయవద్దు

*హేమాహేమీలున్న చిత్ర పరిశ్రమంలోకి నీలాంటివారు కూడా వచ్చారా అని ఎవరు బాధ పడకూడదు*

## అప్పుడే నీ నట జీవితానికో అర్థం పరమార్థం ఉంటుంది



సీనియర్ జర్నలిస్ట్ వేమూరి అశోక్ కుమార్ పై చంద్రహాస్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు

**అమరావతి ( మనసులో మాట) :**

సినిమా ప్రమోషన్ కోసం ఎంతకైనా దిగజారుతారా అని రంగనాయకులు ప్రశ్నించారు. ఈవెంట్‌లో ‘బరాబర్ బూతు పాట‘ పాడి సోషల్ మీడియాలో నెటిజన్లతో ఛీ కొట్టించుకుంటున్నారని, ఇలాంటి గలీజ్ పనులతో సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ధ్వజమెత్తారు. తండ్రి ప్రభాకర్‌కు ఇండస్ట్రీలో ఉన్న మంచి పేరును కొడుకు చెడగొడుతున్నాడని నెటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

### జర్నలిస్టులపై బెదిరింపులా? ఖబడ్దార్!

ఈ అసభ్యకరమైన ధోరణిని ప్రశ్నించిన సీనియర్ జర్నలిస్టు వేమూరిపల్లి అశోక్ కుమార్ పై చంద్రహాస్ అహంకారంతో మాట్లాడటంపై రంగనాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమా ప్రమోషన్ కోసం ‘గలీజ్‘ పాటలను వాడుకోవడమే కాకుండా, సమాజం పట్ల బాధ్యతగా ఉండే జర్నలిస్టులను బెదిరించడం సిగ్గుచేటు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, సమాజంలోని మంచి చెడులను విశ్లేషించే జర్నలిస్టులపై ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోం“ అని హెచ్చరించారు. సమాజంలో మంచి చెడులను విశ్లేషించి చెప్పే జర్నలిస్టులపై నీ ‘యాటిట్యూడ్‘ చూపిస్తూ లాయర్లతో కేసు వేయిస్తానని బెదిరిస్తావా? నీ బెదిరింపులకు భయపడే వారు ఎవరూ లేరు. సమాజానికి పెడదోవ పట్టించే నీలాంటి వారికి బరాబర్ బుద్ధి చెబుతాం“ అన్నారు.

### సంస్కారం లేని నటన ఎందుకు?

బూతు పాటలు పాడుతూ, ప్రశ్నించిన వారిని బెదిరించడం చంద్రహాస్ అజ్ఞానానికి నిదర్శనమని ఆయన అన్నారు. “నీ అసభ్యకర ప్రవర్తనను నీ తల్లిదండ్రులు కూడా ఖండించకపోవడం చూస్తుంటే, వారు కూడా సమర్థిస్తున్నారనే అనుమానం కలుగుతోంది. నీ ప్రవర్తన చూసి ఈవెంట్‌కు వచ్చిన ముఖ్య అతిథులు సైతం సిగ్గుతో తలదించుకుంటున్నారు. అయినా నీకు సిగ్గు రాకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు.

### చిత్ర పరిశ్రమ పరువు తీయవద్దు

సమాజంలో బ్రతుకుతున్నప్పుడు మంచి నడవడిక ముఖ్యం. చిత్ర పరిశ్రమలో నిలదొక్కుకోవాలంటే కేవలం నటన మాత్రమే సరిపోదని, సమాజంలో ఎలా నడుచుకోవాలో తెలియాలని, అప్పుడే నీజీవితానికి ఒక అర్థం ఉంటుంది అని రంగనాయకులు హితవు పలికారు. ఎంతోమంది మహానుభావులున్న ఈ చిత్ర పరిశ్రమలోకి వచ్చి, ఇలాంటి ప్రవర్తనతో పరిశ్రమ పరువు తీయవద్దని హెచ్చరించారు. జర్నలిస్టులను తక్కువ చేసి చూస్తే బారాబర్ బుద్ధి చెబుతామని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని మేడవరపు రంగనాయకులు హెచ్చరించారు

